## సెట్ ఎగ్జామ్స్‌పై అవగాహనకు హెల్ప్‌లైన్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : ఎప్‌సెట్, పీజీఈసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు సెట్ పరీక్షలకు దరఖాస్తులు చేసుకోవడానికి కావాల్సిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జేఎన్‌టీయూలోని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం నిర్ణయించింది. అందుకోసం ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసింది. ఇలాంటి ప్రవేశ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి? పరీక్షలకు ఏ విధంగా దరఖాస్తులు చేసుకోవాలి? కౌన్సెలింగ్‌కు ఎలా హాజరు కావాలి, ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ఫోరం ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామని ఫోరం నాయకులు తెలిపారు. వివరాల కోసం దిలీప్ 7801009838, రాహుల్‌నాయక్ 9392868221 ఫోన్ నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

## ఐకాస డైరీ ఆవిష్కరణ

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ ఐకాస 2026 డైరీని శనివారం వీసీ డాక్టర్ టి. కిషన్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. డైరీలను రెక్టార్ డాక్టర్ కె. విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావుకు అందజేశారు. మాల మహానాడు గౌరవ అధ్యక్షుడు జి. చెన్నయ్య, ఐకాస రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ మంద రంజిత్‌కుమార్, మేడి పాపయ్య, శ్రీనివాస్, ప్రణయభాస్కర్, సాయికృష్ణ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూను సందర్శించిన ఐర్లాండ్ బృందం



సదస్సులో ఐర్లాండ్ మంత్రి జాక్ చాంబర్స్, వీసీ టీకేకే రెడ్డి, ఇతర ప్రతినిధులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ఐర్లాండ్ ప్రభుత్వ ప్రజా వ్యయం, మౌలిక సదుపాయాల కల్పన శాఖ మంత్రి జాక్ చాంబర్స్ ప్రతినిధి బృందం శనివారం జేఎన్‌టీయూని సందర్శించింది. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ టి. కిషన్‌కుమార్‌రెడ్డి, రెక్టార్ డాక్టర్ కె. విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు వారికి స్వాగతం పలికారు. పరస్పర విద్యా సహకారంపై ఇరువురు చర్చించుకున్నారు. అనంతరం యూజీసీ ఆడిటోరియంలో ఐర్లాండ్‌లో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై నిర్వహించిన సదస్సులో మంత్రి జాక్ చాంబర్స్ ప్రసంగించారు. జేఎన్‌టీయూతో విద్యాపరమైన ఒప్పందానికి ఆసక్తిగా ఉన్నట్లు పేర్కొన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి ఐర్లాండ్ స్వాగతం పలుకుతుందన్నారు. ఐర్లాండ్‌లో రెండేళ్ల పీజీ వీసా పొందిన విద్యార్థులు ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రతిభ ఆధారంగా ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. ఐర్లాండ్ వర్సిటీల్లో ట్యూషన్ ఫీజు, ఇమ్మిగ్రేషన్ పాలసీ, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. వీసీ టీకేకే రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే స్వీడన్, జర్మనీ వర్సిటీలతో చేసుకున్న ఒప్పందాల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి. నరసింహారెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్. గిరిధర్, టెక్‌ఫైండర్ సీఈవో ప్రవీణ్ మదిర్, వీసీ అధికారిణి మోరా తదితరులు పాల్గొన్నారు.

## సెట్ పరీక్షలపై హెల్ప్‌డెస్క్ గోడపత్రిక ఆవిష్కరణ

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం సెట్ పరీక్షలపై సందేహాల నివృత్తి కోసం హెల్ప్‌డెస్క్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఎప్‌సెట్, పీజీఈసెట్, పాలిసెట్, ఈసెట్, ఐసెట్ పరీక్షలకు సంబంధించి చరవాణిలో ధ్రువపత్రాల పరిశీలన, వెబ్ ఆప్షన్లు చేసుకునే విధానంపై అవగాహన కల్పిస్తూ ఈ డెస్కును అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఫోరం సభ్యులు తెలిపారు. వివరాలకు 7801009838, 9392868221 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

## జేఎన్‌టీయూహెచ్‌ను సందర్శించిన ఐర్లాండ్ మంత్రి జాక్ చాంబర్స్



జేఎన్‌టీయూ వైస్‌ఛాన్సలర్‌తో పాటు ఐర్లాండ్ మంత్రి జాక్ చాంబర్స్ ప్రతినిధి బృందం

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రప్రభ) : ఐర్లాండ్ ప్రభుత్వ మంత్రి జాక్ చాంబర్స్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం జేఎన్టీయూహెచ్ ను సందర్శించింది. ఈ సందర్భంగా వైస్-ఛాన్సలర్ డా.టి.కిషన్‌కుమార్ రెడ్డితో కలిసి విద్యా భాగస్వామ్యాలు, పరస్పర సహకార అవకాశాలపై చర్చలు జరిపారు. యుజిసి ఎమ్ఎమ్‌టిసి ఆడిటోరియంలో నిర్వహించిన ఇంటరాక్షన్ కార్యక్రమంలో ఐర్లాండ్‌లో ఉన్నత విద్య, స్కాలర్‌షిప్‌లు, కెరీర్ అవకాశాలపై మంత్రి వివరించారు. గత పదేళ్లలో భారత్-ఐర్లాండ్ వాణిజ్యం 90 శాతం పెరిగిందని, రెండు దేశాలు సాంకేతిక రంగంలో ముందంజలో ఉన్నాయని పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌లు, ట్యూషన్ ఫీజులు, వీసా విధానాలపై విద్యార్థుల ప్రశ్నలకు మంత్రి సమాధానాలు ఇచ్చారు. ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య విద్యా సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని విశ్వవిద్యాలయ వర్గాలు తెలిపాయి.

## భారత్‌తో విద్యా భాగస్వామ్యాలకు పెద్దపీట

- ఉన్నత విద్య, పరిశోధనల్లో కలిసి అడుగులేద్దాం
- గత పదేళ్లలో 90 శాతం పెరిగిన ద్వైపాక్షిక వాణిజ్యం
- జేఎన్టీయూహెచ్ సందర్శనలో ఐర్లాండ్ మంత్రి జాక్ చాంబర్స్
- ఉన్నత విద్యకు ఐర్లాండ్ సరైన గమ్యస్థానం: వీసీ కిషన్ కుమార్ రెడ్డి





[illegible]

## ఈఏపీసెట్‌కి 20 వేలకు పైగా దరఖాస్తులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకోసం నిర్వహించే టీజీ ఈఏపీసెట్-2026 దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం సాయంత్రం నాటికి అందిన దరఖాస్తుల వివరాలను సెట్ కన్వీనర్ డాక్టర్ కె. విజయకుమార్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు మొత్తం 20,143 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీటిలో ఇంజినీరింగ్ విభాగానికి 12,770, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకు 7,354, రెండు విభాగాలకు కలిపి 19 వచ్చాయని, మొత్తం కలిపి 20,143 వచ్చినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల ప్రక్రియ సజావుగా సాగుతోందని, అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా కన్వీనర్ సూచించారు.